క్లుప్తంగా

శోభాయమానంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



పాతగుంటూరు: అరండల్ పేట 4వలైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయ ప్రధానాచార్యులు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో శ్రీచక్ర అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో వేద మంత్రాల నడుమ ధాన్యలక్ష్మీ నారాయణుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గణపతి పూజ, కుంకుమపూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, రక్షాధారణ, నవగ్రహారాధన, మాంగళ్య పూజ వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో దంపతులు భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

అమర వీరులకు నివాళులు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ కోసం, మాదిగల హక్కుల కోసం తమ ప్రాణాలను అర్పించిన మాదిగ అమరవీరుల త్యాగాలకు అనుగుణంగా వారి ఆశయసాధన కోసం మాదిగలంతా ముందుకు సాగాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ తెలియజేశారు. బుధవారం మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సంఘ కార్యాలయంలో అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పోరును మరింత ఉధృతం చేసి రిజర్వేషన్ సాధించుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: మతిస్థిమితం లేని పరిస్థితుల్లో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని గాయాలపాలైన వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అలీనగర్‌కు చెందిన షేక్ మస్తాన్ (48) మతిస్థిమితం సరిగా ఉండదు. ఈక్రమంలో మంగళవారం బాలాజీనగర్‌కు వెళ్లి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

వినూత్న ప్రయోగాలతో మనోవికాసం

ఫిరంగిపురం: వినూత్నప్రయోగాలద్వారా విద్యార్థుల మనోవికాసానికి ఎంతో దోహదపడతాయని బాల ఏసుదేవాలయ విచారణగురువులు పామిశెట్టి బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమంలో సెయింట్‌ఆన్స్ కరస్పాండెంట్ సిస్టర్ ఆరోగ్యమేరి, ప్రిన్సిపాల్ కె.నిర్మలామేరి పాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థులకు మంచి భవిష్యత్

మంగళగిరి: ఉర్దూ భాషకు మంచి భవిష్యత్ ఉందని, కాబట్టి ప్రతి పాఠశాలలో ఉర్దూ తప్పక బోధించాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి డి.ఖాసిం పేర్కొన్నారు. నగర పరిధిలోని నూతక్కి, పెదవడ్లపూడిలోని మండల పరిషత్ ఉర్దూ పాఠశాలలో బుధవారం ఎంఈఓ జి.సత్యనారాయణతో కలసి రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం, నోటు పుస్తకాలు, వర్క్ బుక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు రూపొందించుకుని బోధన చేయాలని, విద్యార్థులు నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్ క్రమం తప్పకుండా పరిశీలించి విద్యార్థులకు తగిన సూచనలు ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, ఆయేషా సిద్ధిఖీ, పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

తాడేపల్లి రూరల్: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. సీపీఎం సీనియర్ నాయకుడు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, శివన్నారాయణ పాల్గొన్నారు.

నేడు కె.విశ్వనాథ్, జీజీ కృష్ణారావు సంతాపసభ

తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ సినీదర్శకుడు కె.విశ్వనాథ్, ప్రముఖ ఫిల్మ్ ఎడిటర్ జీజీ కృష్ణారావు సంతాపసభను గురువారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక పెన్షనర్స్ హాలులో నిర్వహించనున్నా రు. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే పలు సినిమాలకు దర్శకత్వం వహించిన తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు, సినీఎడిటర్ జీజీ కృష్ణారావుకు సినీ అనుబంధం ఉందని స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయి లక్క రాజు తెలిపారు.

300లకు పైగా సినిమాలకు ఎడిటింగ్ చేసిన కృష్ణారావు, కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన అన్ని సినిమాలకు పనిచేశారని చెప్పారు. 40 ఏళ్ల నాడు శంకరాభరణం సినిమా విడుదలైన మార్చి 2న సంతాపసభలో పాల్గొని ఆ సినిమాకు పనిచేసిన గొప్ప వ్యక్తులను స్మరించుకుని నివాళులు అర్పించాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా..

- ప్రభుత్వం ముందుకు సాగుతోంది
- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి

పట్నంబజారు: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. ఈమేరకు బుధవారం 30వ డివిజన్ ఏటీఅగ్రహారం 17వ లైను, 17వ లైను ఒకటో అడ్డరోడ్డుకు సంబంధించి రూ. 49 లక్షలతో సీసీ డ్రెయిన్‌ల నిర్మాణ పనులు ప్రారంభించారు. 18, 19 లైనుల్లో రూ. 32 లక్షలతో సీసీ డ్రెయిన్లు, 9వ లైను ఒకటో అడ్డరోడ్డు నుంచి 11వలైను ఒకటో అడ్డరోడ్డు వరకు రూ.12 లక్షలతో సీసీ డ్రెయిన్‌లు, 11, 12 లైను రెండో అడ్డరోడ్డు నుంచి మూడో అడ్డరోడ్డు వరకు రూ. 20 లక్షలతో సీసీ డ్రెయిన్‌లు, ఆర్‌సీసీ కల్వర్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ డ్రెయినేజీ పనులకు సంబంధించి స్థానిక ప్రజలు అనేక మార్లు వివరించిన నేపథ్యంలో సీఎం జగన్ సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు లింగేశ్వరరావు, కోటయ్య, లక్ష్మీరెడ్డి, సీతారామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరి

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

- ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి
- పెదకాకాని గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

పెదకాకాని: అభివృద్ధి పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి స్పష్టం చేశారు. పెదకాకానిలో జరుగుతున్న కోట్ల రూపాయల అభివృద్ధి పనుల్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఎంపీ నిధులతో పెదకాకాని ప్రధాన సెంటర్ నుంచి శివాలయం వరకూ రూ. 1.95 కోట్లతో సీసీ రోడ్డు విస్తరణ, డివైడర్ ఏర్పాటు, రూ. 70 లక్షలతో మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల మాట్లాడుతూ భవిష్యత్ తరాల్ని దృష్టిలో పెట్టుకుని పనులు పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. ప్రజలందరి సహకారంతో పెదకాకాని గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ముందుగా పెదకాకాని శివాలయం రోడ్డును పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. డివైడర్ నిర్మాణం పనులపై సున్నితంగా వారికి మందలించారు. అనంతరం శివాలయంలో పారిశుద్ధ్య పనుల్ని తనిఖీ చేశారు. ఆలయ ప్రాంగణమంతటా పరిశుభ్రంగా ఉండాలని, ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి సూచించారు. చివరిగా పెదకాకాని మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ పనుల్ని పరిశీలించారు. నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, షేక్ షహనాజ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి అంగలకుదురు సాంబశివరావు, స్థానిక నాయకులు గోళ్ల జోసెఫ్, ఉయ్యూరు సతీష్‌రెడ్డి, ఆలపాటి రాఘవ, సుంకర కృష్ణారెడ్డి, చింతా కుమారస్వామి, సుంకర నర్సిరెడ్డి, తాడిబోయిన వేణు, బందెల ఉదయ్‌శంకర్, షేక్ నజీర్ అహ్మద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

టార్గెట్ పెట్టుకుని పన్నులు వసూలు చేయండి

- సెంటిమెంటుతో పంచాయతీలు నడపలేం
- జిల్లా పంచాయతీ అధికారి ఆర్ కేశవరెడ్డి

ప్రత్తిపాడు: సెంటిమెంట్లు పెట్టుకుంటే పంచాయతీలను నడపలేమని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా పన్నుల బకాయిలు, ఇప్పటి వరకు వసూళ్ల చేసిన వివరాల్ని ఆయా పంచాయతీల సెక్రటరీలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్తిపాడు, పెదగొట్టిపాడు, గనికపూడి పంచాయతీల్లో లక్షల్లో బకాయిలు పేరుకుపోయి ఉండటంతో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. ప్రతి రోజూ లక్షన్నర రూపాయల ప న్నుల వసూళ్లు టార్గెట్‌గా పెట్టుకుని పని చేయాలని సూచించారు. నాలుగైదేళ్ల క్రితం నాటి బకాయిలు కూడా పంచాయతీలో ఉన్నాయని, ఎందుకు వసూలు చేయడం లేదని డీపీవో ప్రత్తిపాడు సెక్రటరీ వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. నిత్యం పన్నుల వసూళ్లకు తిరుగుతున్నామని, వ్యవసాయ పనుల సీజన్ కావడంతో రైతులు కొంత ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని సెక్రటరీ చెప్పారు. స్పందించిన డీపీవో ఇలాంటి సెంటిమెంట్లు పెట్టుకుంటే ఎలాగని ప్రశ్నించారు. తుమ్మలపాలెంలో పన్నులు చెల్లించేందుకు స్థానికులు ముందుకు రావడం లేదని సెక్రటరీ చెప్పడంతో, వారి కుళాయిలకు వెంటనే డమ్మీలు వేయాలని డీపీవో ఆదేశించారు.



ప్రత్తిపాడులో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న డీపీఓ కేశవరెడ్డి

పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంపై ఈఓపీఆర్డీ అసహనం

పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంపై ఈవోపీఆర్డీ ఎం మోషె అసహనం వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి 10.45 గంటలకే సమావేశానికి హాజరు కాగా, పంచాయతీ కార్యదర్శులు కొందరు 11.45 గంటల వరకుకు హాజరవుతుండటంతో ఈవోపీఆర్డీ మండిపడ్డారు. సమయపాలన పాటించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇదే చివరిఛాన్స్ అని, సమావేశాలకు ఇకపై ఇలా ఆలస్యంగా వచ్చే వారు రావలసిన అవసరం లేదని తేల్చిచెప్పారు. అనంతరం జగనన్న హౌసింగ్‌పై డీపీవో ఇంజినీరింగ్ అసిస్టెంట్లుతో చర్చించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసి ఇళ్లనిర్మాణాలకు ముందుకు వచ్చేలా చూడాలని చెప్పారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సురేష్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలామృతంలో పలు పోషకాలు

పెదనందిపాడు: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బాలామృతంలో పలు పోషకాలు ఉన్నాయని, మూడేళ్ల లోపు చిన్నారులకు తప్పక పెట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతీదేవి తెలిపారు. పెదనందిపాడు బీసీ–3 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ భారతీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రభుత్వం పోషక విలువలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని అందిస్తోందన్నారు. ఇంటి వద్ద కూడా తల్లిదండ్రులు చిన్నారుల పోషణపై శ్రద్ధ తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనంలో మెనూ అమలు తప్పనిసరి

టీకేపాలెం(కాకుమాను): మధ్యాహ్న భోజనం పథకంలో తప్పనిసరిగా మెనూ అమలు చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ ఉపాధ్యాయులకు చెప్పారు. మండలంలోని టీకేపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజన పథకంలో అనేక మార్పులు చేసినట్లు తెలిపారు. మారిన మెనూ ప్రకారం ప్రతీ రోజూ భోజనాన్ని విద్యార్థులకు సరిపడా అందించాలని ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు పరిశీలించి, విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ

చేబ్రోలు: తమ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వల్లూరి అశ్వినికి బుధవారం పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ పి. నాగభూషణ్ తెలిపారు. ''లో పవర్, ఏరియా ఎఫిసియంట్ అండ్ రిలియబుల్ సీఎన్‌టీ ఎఫ్‌ఈటీ (కార్బన్ నానో ట్యూబ్ ఫీల్డ్ ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్) బేస్డ్ ఎస్ఆర్‌ఏఎం (స్టాటిక్ రాండమ్ యాక్సిస్ మెమరీ) డిజైన్ ఫర్ ఏ పేస్‌మేకర్ డివైస్'' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.



కర్రసాములో హర్షితారెడ్డి ప్రథమస్థానం



విద్యార్థిని హర్షితారెడ్డిని అభినందిస్తున్న భరత్‌రెడ్డి, దిలీప్

గుంటూరు ఎడ్యుకేషన్: నేషనల్ యూత్ స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ ఫెడరేషన్ నిర్వహించిన 11వ నేషనల్ యూత్ గేమ్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా కర్రసాము (సిలంబం) పోటీలో స్టెమ్ స్కూల్లో 6వ తరగతి విద్యార్థి ఆళ్ల హర్షితారెడ్డి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. విద్యానగర్‌లోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో భరత్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాయామ క్రీడలతో పాటు ఆత్మరక్షణ కోసం కర్రసాము వంటి విద్యలను సాధన చేయడం ఎంతో అవసరమని తెలిపారు. ఈసందర్భంగా ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించిన విద్యార్థినితో పాటు కోచ్ కాశీ విశ్వనాథ్‌రెడ్డిని భరత్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ దిలీప్, ఉపాధ్యాయులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు. ఆత్మకూరు నుంచి ఇప్పటం వెళ్లే దారిలో చెరువులో మృతదేహం ఉందని స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి 35–40 సంవత్సరాలు, ఆరెంజ్ కలర్ టీషర్టు మీద ఎస్‌వీఎం అని రాసి ఉందని, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, నలుపురంగు కట్ బనియన్, కుడిచేతికి ఇనుప కడియం ఉన్నాయని ఆయన తెలిపారు. తాడేపల్లి ఎస్ఐ వినోద్ కేసు నమోదు చేశారు.

వంటగ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం బసవతారక నగర్‌లోని ఓ నివాస గృహంలో వంట గ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వాషింగ్ మెషీన్, విద్యుత్ మీటరు దగ్ధం కాగా ఓ వృద్ధుడు ప్రాణాలతో బయట పడ్డాడు.

జయ నాగశ్రీకి గోల్డ్ మెడల్

మంగళగిరి: పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో మంగళగిరికి చెందిన ఆకురాతి జయ నాగశ్రీ కి 2018–20 విద్యా సంవత్సరంలో ఎమ్మెస్సీ స్టాటిటిక్స్ పూర్తి చేసి ఆ విభాగంలో గోల్డ్ మెడల్ అందుకుంది. యూనివర్సిటీలో మంగళవారం రాత్రి నిర్వహించిన కాన్వకేషన్ కార్యక్రమంలో పాండిచ్చేరి ప్రభుత్వ జిక్మార్ ఆస్పత్రి డైరెక్టర్ ఆకాష్‌కుమార్ చేతుల మీదుగా జయ నాగశ్రీ గోల్డ్ మెడల్ అందుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం జయ నాగశ్రీ, సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తోంది.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణ పోరాటం మృతి చెందిన 12 మంది అమరవీరుల ఆశయ సాధనకు కృషిచేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని బాబూ జగ్జీవన రామ్ విగ్రహం వద్ద బుధవారం మృతి చెందిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కలకోటి నాగేశ్వరరావు, చందోలు విక్టర్ పాల్, నన్నేపల్లి రాజేష్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన సాంకేతిక ఉత్సవం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో సాంకేతిక ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల ఏఆర్ డీఎస్పీ మంగళగిరి ప్రేమ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చని, విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవరచుకోవాలని అన్నారు. లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సి.ఇ.వో. వేములపల్లి రవికరణ్ యాంత్రిక సాంకేతిక ఉత్సవం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, కేఎల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రామకృష్ణ పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు బుద్ధుని సిద్ధాంతాలు దోహదం

వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: మన సమాజంలోని కుల నిర్మూలనకు బుద్ధుని సిద్ధాంతాలు దోహదం చేస్తాయని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బుద్ధిజం విభాగం ఆధ్వర్యంలో 'బుద్ధ అండ్ యాంటీ క్యాస్ట్ భక్తి సెయింట్స్' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సును బుధవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ బుద్ధుని సిద్ధాంతాలు అనుసరణీయమన్నారు. నేటి సమాజానికి బుద్ధుని సిద్ధాంతాలు ఎంతో అవసరమని తెలిపారు. కుప్పం ద్రవిడియన్ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కె.ఎస్. చలం కీలకోపన్యాసం చేస్తూ ప్రపంచ వ్యాప్తంగా 60 కోట్లమంది బుద్ధుడిని అనుసరించే వారున్నారని తెలిపారు. క్రీస్తు కంటే ముందే బుద్ధుడు గొప్ప వ్యక్తి అయినప్పటికీ అతడి పేరు మీద శకం లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని అభిప్రాయపడ్డారు. మనదేశంలో బుద్ధిజం అంతగా మనుగడలో లేకపోవడం సమంజసం కాదన్నారు. బుద్ధిజంలోని అనేక సిద్ధాంతాలు అనుసరించి కుల నిర్మూలన కార్యక్రమాలు జరిగాయన్నారు. బుద్ధుని అనుచరులు నడచిన, ఆనవాళ్ళు కలిగిన నేల గుంటూరు జిల్లా అని కొనియాడారు. ద్రవిడ సంస్కృతి భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాలలో కూడా ఉందని తెలిపారు. సదస్సు డైరెక్టర్ ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. సదస్సులో దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, బౌద్ధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పిస్తున్నారని తెలిపారు. సదస్సు కోశాధికారి ఆచార్య ఎల్ ఉదయ కుమార్, బుద్ధిజం మాజీ విభాగాధిపతి ఆచార్య ఎం వీ రామ్‌కుమార్ రత్నం తదితరులు ప్రసంగించారు. పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, వేదికపై సదస్సు డైరెక్టర్ ఆచార్య స్వరూపరాణి

జిల్లా గ్రంథాలయానికి రచనా పుస్తకాల బహూకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి శనివారపు లక్ష్మీ రామాంజనేయరెడ్డి ప్రచురించిన 'సత్యం శోచితం అర్హసి' పుస్తకానికి సంబంధించిన 98 కాపీలను అందజేశారు. బుధవారం జిల్లా జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ సమక్షంలో మాజీ చైర్మన్ నర్సిరెడ్డి మేనల్లుడు, ప్రచురణకర్త లక్ష్మీ రామాంజనేయరెడ్డి పుస్తకాలను బహుకరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, సహాయ గ్రంథ పాలకుడు కె. చిన్నపరెడ్డి, గ్రంథ పాలకులు దుర్గారెడ్డి, బి. శకుంతల, పి. సత్య శిరీష, సిబ్బంది కె. శ్రీనివాసరావు, జి. రాజేష్, పి. నారాయణరెడ్డి పాల్గొన్నారు.



బత్తుల దేవానంద్‌కు పుస్తకాలను అందజేస్తున్న దాత నర్సిరెడ్డి, రామాంజనేయరెడ్డి

ఘనంగా ఉచిత ఉపనయనాలు

గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవా సమితి గత 25 సంవత్సరాలుగా ఉచిత ఉపనయనాలు, విద్యా పారితోషకాలు, వితంతు పెన్షన్లు లాంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని సేవా సమితి అధ్యక్షుడు ఆర్.లక్ష్మీపతి అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి నూతన భవనంలో బుధవారం ఉచిత సామూహిక ఉపనయనాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్రాహ్మణ బంధువులు 500 మందికి భోజన, వసతి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సమితి సొంత భవనంలో ఉపనయనాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కోవిడ్‌వల్ల రెండు సంవత్సరాలుగా నిర్వహించలేకపోయినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి కె. సీతారమేష్, ఉపనయన కార్యక్రమం కన్వీనర్ కర్లపాలెం బాలకృష్ణ, తుళ్లూరు ప్రకాష్, గొల్లపూడి రామకృష్ణారావు, నరసింహానంద భారతి స్వామీజీ, కార్యవర్గ సభ్యులు పొత్తూరు మురళీమోహన్, పాతూరి శ్రీనాథ్, వీరంరాజు కష్టమూర్తి, సాయిబాబా శర్మ, మాదల వెంకటకృష్ణ, పోతుకూచి మల్లికార్జున మూర్తి, సంబరాజు రవికుమార్ పాల్గొన్నారు.



సామూహిక ఉపనయనంలో పాల్గొన్న లక్ష్మీపతి, నసింహానంద భారతి స్వామీజీ

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- 43వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వర్గాలకు, పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. బుధవారం 43వ డివిజన్ లోని 136వ సచివాలయం పరిధిలోని విష్ణునగర్, సుగాలి కాలనీ, కొమ్మినేనినగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను ఆరా తీశారు. స్థానిక సమస్యలపై చర్చించి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టించారని, సంక్షేమ పథకాల సారథిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో వినూత్న పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. కోట్ల రూపాయాలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్ది, విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి డిజిటల్ విద్యను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించారని చెప్పారు. పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు పక్కా గృహాలు, ఇంటి వద్దకే వైఎస్సార్ పింఛన్ కానుక, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత తదితర పథకాలు పేదలకు వరంగా మారాయన్నారు. అంతేగాక సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి పాలనను ప్రజల వద్దకు తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, 43వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మందాల కోటిరెడ్డి, పార్టీ నాయకులు కరుణాకర రెడ్డి, ధనావత్ వెంకటేశ్వర్లునాయక్, వెంకటేశ్వరెడ్డి, కస్పారెడ్డి, ఉదయ్, శ్రీనునాయక్, ప్రేమ్‌కుమార్, నాగరాజు, పాగర్తి రవీంద్ర, సంబంధిత సచివాలయం అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, సజీల, కోటిరెడ్డి

ఒడిశా వాసి ఆత్మహత్య

పెదకాకాని: ఒడిశాకు చెందిన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. పెదకాకాని ఎన్‌టీఆర్ కాలనీలో కొంతకాలంగా ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మృతుడు కాల్ ప్రధాన్ భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నాడు. ప్రత్తిపాడు మండలం కోండ్రుపాడులోని పొగాకు కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల గొడవ జరిగి అతడి భార్య గత ఆదివారం ఒడిశా రాష్ట్రానికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి ముందు లైట్ స్విచ్ ఆపేందుకు పక్కనే ఉన్న వారి బంధువులు వెళ్లి కిటికీలో నుండి తొంగి చూడగా ప్రధాన్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. తలుపులు తీసి చూడగా అప్పటికే అప్పటికే మరణించాడు. పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు మార్చురీకి తరలించారు.